జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం... ప్రజల కోసం
## సిద్దిపేట
శుక్రవారం | 12 | జూన్ | 2026 | పేజీలు : 8

## ధాన్యం కొనుగోలు పై ఇంత నిర్లక్ష్యమా

ధాన్యాన్ని తక్షణమే తరలించాలి...మిట్టపల్లి లో రైతుల ధర్నా



6 లో

## బస్ స్టేషన్ ఆధునీకరణ, వసతుల కల్పన

రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



# సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా అడుగులు

హుస్నాబాద్, జూన్ 11 (ప్రజా జ్యోతి): హుస్నాబాద్ బస్ స్టేషన్ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించటంతో పాటు,వర్షాకాలంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సూచించారు. హుస్నాబాద్ బస్ స్టేషన్లో వర్షాకాలంలో ఏర్పడుతున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి హుస్నాబాద్ బస్ స్టేషన్ను మంత్రి పరిశీలించారు.ఈ సందర్భంగా బస్ స్టేషన్లోని ప్రయాణికులతో నేరుగా మాట్లాడిన మంత్రి, బస్సుల రాకపోకలు, మౌలిక సదుపాయాలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బస్ స్టేషన్ వెనుక భాగంలో ఉన్న నాలాను ప్రధాన డ్రైనేజీ వ్యవస్థకు అనుసంధానం చేసేలా అండర్గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీర్లు,

మిగతా 2లో..

## సొంతింటి కళ సాకారం

సంక్షేమం పైనే ప్రధాన దృష్టి... త్వరలోనే నూతన పెన్షన్లు

రాష్ట్ర కార్మిక శాఖమంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



దుబ్బాక,మిరుదొడ్డి, జూన్ 11 (ప్రజాజ్యోతి):- పేదోడి సొంతింటి కళ సాకారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర కార్మిక, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు.గురువారం సాయంత్రం అక్బర్ పేట-భూం పల్లి మండల కేంద్రంలోని రామలింగేశ్వర ఫంక్షన్ హాల్ లో దుబ్బాక నియోజకవర్గంలోని 594మంది లబ్ధిదారులకు ఐదు కోట్ల రూపాయల కళ్యాణ లక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను దుబ్బాక శాసన సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కె. హైమావతిలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జీ మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీ లను

మిగతా 2లో..

## మొక్కలు నాటడంలో నెం.1

- రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలవాలి
- అవెన్యూ ప్లాంటేషన్ కు సంసిద్ధంగా ఉండాలి
- ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండాలి
- రాష్ట్రం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



4 లో

## ప్రజాస్వామ్యాన్ని కాపాడేది బీజేపీ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు



2 లో



# వరిలో వెద సాగుతో లాభాలు

## భూసారాని కాపాడుకోవడానికి జిలుగు జనుము వాడండి

## రైతు విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ పల్లవి



దుబ్బాక, జూన్ 11(ప్రజా జ్యోతి): రైతులు వరి సాగులో వెద సాగు పద్ధతి పాటించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్, శాస్త్రవేత్త డా. సి.హెచ్. పల్లవి తెలిపారు. గురువారం నాడు దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ లో వరిలో వెదసాగు, సమతుల్య ఎరువుల యాజమాన్యంపై రైతులతో దుబ్బాక మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శనితో చర్చా గోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వెద సాగు పద్ధతి ద్వారా వ్యవసాయంలో కూలీల కొరత, సాగు ఖర్చులు తగ్గి లాభసాటిగా సాగుతుందన్నారు. సాంప్రదాయ నారు నాటే పద్ధతికి భిన్నంగా, వరిలో వెదసాగు పద్ధతిలో ముందుగా మొలకెత్తించిన విత్తనాలను బురదగా తయారుచేసిన పొలంలో నేరుగా డ్రమ్ సీడర్ ద్వారా విత్తుకోవాలని, ఈ విధానం ద్వారా నారు పెంపకం, నారు పీకడం, నాట్లు వేయడం వంటి పనులు అవసరం ఉండవన్నారు. వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించడంతో పాటు నేల సారాన్ని దీర్ఘకాలం రక్షించడానికి సమతుల్య ఎరువుల వినియోగం అత్యంత అవసరమని తెలిపారు. రైతులు సాధారణంగా నత్రజని (యూరియా) ఎరువులను అధికంగా వినియోగిస్తూ, భాస్వరం, పొటాష్, సూక్ష్మ పోషకాలను తక్కువగా వాడటం వల్ల నేలలో పోషకాల అసమతుల్యత ఏర్పడి పంటల దిగుబడులు తగ్గే అవకాశం ఉందని, పంటలకు అవసరమైన పోషకాలను సరైన మోతాదులో అందించడానికి ముందుగా రైతులు నేల పరీక్ష చేయించుకోవాలన్నారు. భూసారాన్ని కాపాడుకోవడానికి పచ్చిరొట్ట ఎరువులైన జిలుగు, జనుము, పిల్లిపెసర, పెసరను వేసుకోవడం ద్వారా ఎరువుల ఖర్చును తగ్గించుకోవచ్చునని తెలిపారు. అలాగే సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువు, కంపోస్ట్, పచ్చి ఎరువులు వంటి సేంద్రియ వనరులను రసాయన ఎరువులతో సమన్వయంగా వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగు పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అనూష, రైతులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని కాపాడేది బీజేపీ

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు

కొండపాక, జూన్ 11:( ప్రజా జ్యోతి):- ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు దుష్ప్రచారం మానుకోవాలని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు అన్నారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల పరిధిలోని మాత్పల్లి ప్రైవేట్ రిసార్ట్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఓటరు జాబితాల ప్రక్షాళన కొత్త విషయం కాదని, చనిపోయినవారి పేర్లు, నకిలీ ఓట్లు, ఒకే వ్యక్తికి పలుచోట్ల ఉన్న నమోదులను తొలగించడం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే చర్య అని పేర్కొన్నారు. అర్హులైన భారతీయ పౌరుల ఓటు హక్కులకు ఎలాంటి నష్టం ఉండదని స్పష్టం చేశారు. హైదరాబాద్లో రోహింగ్యాలు ఓటర్లుగా నమోదు కావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ, అక్రమ నమోదులను అడ్డుకోవడమే ఈ ప్రక్రియ లక్ష్యమని తెలిపారు. ఆస్తులు, భూములు, సంక్షేమ పథకాలకు ఓటరు జాబితా సవరణలకు ఎలాంటి సంబంధం లేదని, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని ప్రతిపక్షాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎం. రఘునందన్ రావు, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా అడుగులు



మొదటి పేజీ తరువాయి..

ఆర్టీసీ అధికారులకు మంత్రి ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ లేకుండా చేసి ప్రయాణికుల కు మెరుగైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. రోజుకు సుమారు 35 వేల మంది ప్రయాణికులు ఈ బస్ స్టేషన్ను వినియోగిస్తున్నారని, రెవెన్యూ పరంగా రాష్ట్రంలో ప్రముఖ బస్ స్టేషన్లలో ఇది ఒకటని చెప్పారు. పెరుగుతున్న పట్టణ అవసరాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ కళాశాలలు, పర్యాటక రంగం, మెడికల్ కళాశాలలు, పారిశ్రామిక కారిడార్ అభివృద్ధితో హుస్నాబాద్ ప్రాధాన్యం మరింత పెరుగుతోందన్నారు. నాలుగు జిల్లా కేంద్రాలకు ఫోర్లేన్ రహదారులతో అనుసంధానం కలిగిన హుస్నాబాద్ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారాలతో అభివృద్ధి పనులు చేపడతామని మంత్రి తెలిపారు. ప్రజాధనం వృథా కాకుండా సమర్థవంతమైన ప్రణాళికలతో పనులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ హుస్నాబాద్ బస్ స్టేషన్లో ప్రధాన సమస్య వర్షాకాలంలో నీరు చేరడమేనని అన్నారు. మంత్రి సూచనల మేరకు సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఖాళీ స్థలాలు, వ్యాపార వర్గాల సహకారం లభిస్తే బస్ స్టేషన్ను ఆధునీకీకరించి, పెద్ద షాపింగ్ మాల్ను తలపించే విధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.రెవెన్యూ పరంగా అత్యధిక ఆదాయం వచ్చే ఏ-క్లాస్ కమర్షియల్ బస్ స్టేషన్లలో హుస్నాబాద్ ఒకటని పేర్కొన్న ఆయన, రోజుకు 35 వేల మందికి పైగా ప్రయాణికులు ఈ కేంద్రాన్ని వినియోగిస్తున్నారని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు బస్ స్టేషన్ను ఆధునిక వసతులతో అభివృద్ధి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్పర్సన్ చిత్తరి పద్మ, కౌన్సిలర్లు, ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సొంతింటి కళ సాకారం

మొదటి పేజీ తరువాయి..

అమలుకు చిత్తశుద్ధితో పని చేస్తుందని, పేదవానికో ఇల్లు ఉండాలని ఇందిరా గాంధీ స్ఫూర్తితో సొంతింటి కళా నెరవేర్చడానికి జిల్లాలో దాదాపు 10వేల ఇండ్లు మంజూరు చేశామన్నారు. సొంతింటి కళ సాకారం అయ్యాక యజమానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ఇప్పటివరకు 158 కోట్ల రూపాయలు డిస్కౌంట్ విద్యుత్ శాఖకు ప్రభుత్వం వెచ్చిందన్నారు. మహిళలు ఉచిత బస్సు సౌకర్యం కోసం జిల్లాలో ప్రయాణించిన మహిళలకుగాను 300 కోట్ల రూపాయలు ఆర్టీసీ యాజమాన్యాలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.జిల్లాలో కొత్త రేషన్ కార్డులు 45వేల పైగా మంజూరుతో పాటు కుటుంబ సభ్యుల చేరికలు సైతం చేశామని, అలాగే ప్రతి రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, ఏ పథకం రావాలన్న ప్రతిదీ రేషన్ కార్డుతోనే ముడిపడి ఉంటుందని అందుకోసం పెద్ద ఎత్తున రేషన్ కార్డులు అందజేశామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద 10లక్షల భీమా కల్పించడం జరిగింది.కొత్త పింఛన్లు కోసం ఈ బడ్జెట్ లో కేటాయించడం జరిగిందని, వాటిని కూడా తొందరలో ప్రజలకు అందిస్తామని తెలిపారు.స్కూల్ పిల్లలకు కొత్తగా బ్రేక్ ఫాస్ట్ పథకం అమలుకు శ్రీకారం చుట్టామని ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందన్నారు.ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్న కూడా అన్ని కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు.ఈ సంవత్సరం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులు మొదలయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లు విద్యార్థులకు మంచి నైపుణ్యాలు తో ఉపాధి అందించడం జరుగుతుంది.రాష్ట్రం లో 56 కొత్త అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ప్రారంభించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 4వేల కోట్ల రూపాయలతో





అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లను సౌకర్యాలు మెరుగుపరుస్తూ ఒక సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ అందించి, రాష్ట్రంలోనే కాకుండా బయటి దేశాలకు సైతం ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కోసం మీ యొక్క స్కిల్, భాష ప్రతిదీ నేర్పించడం జరుగుతుందని తెలిపారు.ఈ సీజన్ లో వచ్చే దానికంటే 30 శాతం వరి ధాన్యం అధికంగా పండడం మూలంగా కొనుగోలు జాప్యం జరిగిందని ఎవ్వరు కూడా అధైర్య పడవద్దని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. యూరియా, డిఏపి కొరత లేదని అధునాతన యాప్ ద్వారా కొనుగోలు సులభంగా చేయవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోడానికి సిద్ధంగా ఉందని రైతులకు విజ్ఞప్తి చేశారు.దుబ్బాక ఏంఎల్ఏ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే గొప్ప కార్యక్రమం కళ్యాణ లక్ష్మి శాదిముబారక్ చెక్కుల పంపిణీ దీనివల్ల లక్షలాది మందికి లబ్ది పొందుతున్నారన్నారు.దుబ్బాక నియోజకవర్గం పూర్తి వ్యవసాయ ఆధారిత కుటుంబాలు, దుబ్బాక నియోజకవర్గం లో ఎక్కువ మొత్తంలో వడ్లు పండాయనీ తెలిపారు.మల్లన్న సాగర్ లో మెయిన్ కెనాల్ పూర్తి, సబ్ కెనాల్ సంబంధించి భూ సేకరణకు సంబంధించిన బకాయిలను విడుదల చెయ్యాలని, దుబ్బాక నియోజకవర్గం లో గో-డౌన్ నిర్మించుకునేం దుకు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ 27 ఎకరాలు కేటాయించామని వెంటనే శాంక్షన్ చేసి పనులు ప్రారంభించాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ చైర్మన్ చంద్రం, మున్సిపల్ చైర్మన్ శ్రీ రామ్ సంగీత రవీందర్, ఆర్డీఓ సదానందం, ఆయా మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.




# సప్లిమెంటరీ ఫలితాల్లో సత్తా

## అదరగొట్టిన అభిజ్ఞ



సిద్దిపేట, జూన్ 11 (ప్రజా జ్యోతి): సప్లిమెంటరీ ఫలితాల్లో సత్తా చాటింది పట్టణానికి చెందిన అభిజ్ఞ. ఇంటర్మీడియట్ మొదటి సంవ త్సరం ఎంపీసీ విభాగంలో సిద్దిపేటలోని ప్రతిభ జూనియర్ కళాశా లకు చెందిన విద్యార్థిని గోనె అభిజ్ఞ ఇంప్రూవ్ మెంట్ పరీక్షల్లో సత్తా చాటి గురువారం విడుదల చేసిన ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఆదరగొట్టింది.ఇంటర్మీడియట్ ఫస్టియర్ లో 470 మార్కులు గాను 460 మార్కులు సాధించిన అభిజ్ఞ నిరాశ చెంది మళ్లీ ఇంప్రూవ్ మెంట్ రాయగా 470 మార్కులకు గానూ 467 మార్కులతో ఏ గ్రేడ్ సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.మంచి ఫలితం సాధించిన అభిజ్ఞను కళాశాల యాజమా న్యం అభినందించారు.గతంలో పోగొట్టుకున్న ప్రతి మార్కును తిరిగి సాధిస్తూ మ్యాథ్స్,ఫిజిక్స్,కెమిస్ట్రీ వంటి కఠినమైన సబ్జెక్టులలో వందకు వంద శాతం ఫుల్ మార్కులు సాధించడం ఆమె కఠోర శ్రమకు ,పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు.పట్టణంలోని కాళ్ల కుంట కాలనీలో ఉంటున్న అభిజ్ఞ ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరచ డం పట్ల తల్లిదండ్రులు గోనె మార్కండేయులు-మమత సంతోషం వ్యక్తం చేశారు.

## వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ఎంపీడీవో అఫ్జలుదిన్



దౌల్తాబాద్, జూన్ 11 (ప్రజా జ్యోతి) : వర్షాకాలం లో సీజనల్ వ్యాధు లు ప్రబలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో అఫ్జలుదిన్ సూచించారు. గురువారం మండల కేంద్రం లోని విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, విరేచనాలు వంటి వ్యాధులు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కూలర్లు, నీటి ట్యాంకులు, పూల కుండీలు తదితర ప్రాంతాలను తరచూ శుభ్రపరచాలని సూచించారు. దోమల నివారణ కోసం దోమతెరలు, దోమల నివారణ మందులు ఉపయోగించాలని తెలిపారు.తాగునీటిని తప్పనిసరిగా మరిగించి లేదా శుద్ధి చేసి వినియోగించాలని, ఆహార పదార్థాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని కోరారు.గ్రామపంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించడం తో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో సూచించారు. ప్రజల సహకారంతోనే వర్షాకాల వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన పేర్కొన్నారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

## గ్రంథాలయ సందర్శన ఆత్మ తృప్తినిస్తుంది

## జిల్లా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం

సిద్దిపేట రూరల్, జూన్ 11(ప్రజాజ్యోతి):గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు అని జిల్లా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు. గురువారం నాడు మండలంలోని రాఘవపూర్ గ్రంథాలయాన్ని సందర్శించి పాఠకులు, గ్రామ యువకులతో మాట్లాడారు.వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఏ గ్రంథాలయని సందర్శించినా ఒక ఆత్మ తృప్తిని కలిగిస్తుందన్నారు. గ్రామ యువకులు మంచిగా చదువుకొని ఉద్యోగాలు సాధించాలి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్,







వార్డ్ మెంబర్లు, గ్రామ ఇందిరమ్మ కమిటీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

### దివ్యాంగుల కోసం ప్రత్యేక పుస్తకాలు.....

జిల్లా గ్రంథాలయంలో దివ్యాంగులు (అంధుల) కొరకు వారికీ ఉపయోకరంగా ఉండేలా అవసరమైన (ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు) వారు చదువుకోవడానికి కావలసిన అన్ని పుస్తకములు మన గ్రంథాలయంలో సమ కూర్చారు. చైర్మన్ దరిపల్లి చంద్రం అవసరమైన పుస్తకాలు తెప్పించి అందు బాటులో ఉంచారు.అంతే కాకుండా రెండు కొత్త కంప్యూటర్లు కూడా అం దుబా టులోకి తీసుకువచ్చారు.ఈ సదవకాశాన్ని అందరు ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, ముమ్ముందు కూడా కావాల్సినటువంటి సదుపాయాలు కలిపిస్తూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

## కొమురవెల్లిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలకు పిలుపు

### ఉపాధి హామీ కూలీల హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని తాడూర్ రవీందర్



కొమురవెల్లి, జూన్ 11: (ప్రజా జ్యోతి):- మండల కేంద్రంలోని పద్మశ్రీ గార్డెన్లో నిర్వహించనున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూర్ రవీందర్ పిలుపునిచ్చారు.మండలంలోని అయినాపూర్ గ్రామంలో ఉపాధి హామీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లా డా రు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మార్పులు తీసుకొస్తోందని విమర్శించారు. కొత్తగా తీసుకొచ్చిన వి.బి.జి రామ్జీ చట్టం ద్వారా కార్మికులకు ఇబ్బందులు కలుగుతున్నా యని, పని ప్రదేశాల్లో రోజుకు రెండు సార్లు ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేసి పాత విధానంలోనే పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని ఉపాధి హామీ కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 30 నెలలు గడిచినా ఇప్పటివరకు అమలు కాలేదని ఆరోపించారు. అలాగే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన అనేక హామీలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా మాజీ డైరెక్టర్ తేలు ఇస్తారి, దండు ఎల్లయ్య, మొగుళ్ల మల్లయ్య, బి.పోచయ్య, కనకవ్వ, దండు శంకరవ్వ, కొంతం పోసవ్వ తదితరులు పాల్గొన్నారు.




## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీని అరికట్టాలి: ఏఐఎస్ఎఫ్

### జూన్ 15 నుంచి దశలవారీ ఉద్యమాలు

### ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

### సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేష్ డిమాండ్

చేర్యాల, జూన్ 11 (ప్రజాజ్యోతి): సిద్దిపేట జిల్లావ్యాప్తంగా జూన్ 15 నుండి విద్యాసంస్థలు పునఃప్రారంభం కాబోతున్న నేపథ్యంలో, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేష్ డిమాండ్ చేశారు.గురువారం నరేష్ చేర్యాల కేంద్రంగా ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ...విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్రమైన ఆర్థిక భారం మోపుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.విద్యను వ్యాపారంగా మార్చేశారన్నారు.విద్యను సేవగా కాకుండా పూర్తి వ్యాపారంగా మార్చడం వల్ల మధ్యతరగతి, పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ ఫీజులు, స్పెషల్ ఫీజులు, రవాణా చార్జీల పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ విద్యాశాఖ ఫీజుల నియంత్రణ మార్గదర్శకాలను కఠినంగా అమలు చేసి, నిబంధనలు ఉల్లంఘించే స్కూళ్లపై చర్యలు తీసుకోవాలన్నారు.

**పుస్తకాలు, యూనిఫాంల దందాపై నిఘా పెట్టాలి**

కొన్ని విద్యాసంస్థలు దొంగచాటుగా సెలవుల్లోనే పుస్తకాలు విక్రయిస్తూ వేల రూపాయలు గడిస్తున్నాయని నరేష్ ఆరోపించారు. పాఠశాలల్లోనే లేదా వారు చెప్పిన దుకాణాల్లోనే పుస్తకాలు, యూనిఫాంలు కొనాలని తల్లిదండ్రులను ఒత్తిడి చేయడం అన్యాయమన్నారు. ప్రైవేట్ స్కూళ్ల ఆగడాలపై మండల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని,నూతనంగా వచ్చిన జిల్లా విద్యాశాఖ అధికారి దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరారు.

**ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి..**

మరోవైపు జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, తరగతి గదుల సమస్య వేధిస్తోందని తెలిపారు. తాగునీరు,మరుగుదొడ్లు, క్రీడా మైదానాలు, డిజిటల్ విద్యా సదుపాయాల లేమిని అధిగమించి, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి వ్యతిరేకంగా జూన్ 15 నుండి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా దశలవారీగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని నరేష్ హెచ్చరించారు.

## బక్రిచెప్యాల శాలివాహన

### కుమ్మరి సంఘం అధ్యక్షునిగా నెల్లుట్ల విజయ్



సిద్దిపేట అర్బన్, జూన్11(ప్రజాజ్యోతి):సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామ శాలివాహన కుమ్మరి సంఘం అధ్యక్షునిగా నెల్లుట్ల విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షునిగా అన్నారం యాదగిరి, అన్నారం నరసింహులు, ఉపాధ్యక్షులుగా అన్నారం బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అన్నారం మహేష్, కోశాధికారిగా అన్నారం స్వామి, సలహాదారులుగా అన్నారం వెంకటయ్య, వర్కోలు శంకర్, వర్కోలు అశోక్, అన్నారం యాదగిరి, లక్ష్మయ్య, బాలయ్య, అన్నారం శ్రీనివాస్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను గ్రామ కుమ్మరి సంఘం అధ్యక్షుడిగా నియమించి నందుకు అందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. సంఘాన్ని అభివృద్ధి బాటలో నడిపించి సంఘానికి మంచి పేరు తీసుకురావడానికి అన్ని విధాల కృషిచేస్తానని అన్నారు.

## కొమురవెల్లి దేవాలయంలో జాతర ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

### నూతన క్యూ కాంపెక్స్‌లో స్టీల్ క్యూ లైన్ల ఏర్పాటుకు సూచనలు



కొమురవెల్లి, జూన్ 11 (ప్రజా జ్యోతి):- కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో నూతనంగా నిర్మాణం చేసిన క్యూ కాంప్లెక్స్లో భక్తుల సౌకర్యార్థం స్టీల్ క్యూ లైన్ల ఏర్పాటుకు సంబంధించిన పనులను దేవాలయ అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేమూరి శ్రీనివాస్ శర్మ, దేవాలయ కార్యనిర్వహణాధికారి కట్ట సుధాకర్ రెడ్డి కలిసి క్యూ కాంప్లెక్స్ను సందర్శించి అక్కడ చేపట్టాల్సిన పనులపై సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సక్రమమైన క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు.అలాగే రాబోయే జాతర దృష్ట్యా చేపట్టాల్సిన ఏర్పాట్లు, భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఇంజనీరింగ్ సిబ్బంది మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



# మొక్కలు నాటడంలో నెం.1



### రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలవాలి

### అవెన్యూ ప్లాంటేషన్ కు సంసిద్ధంగా ఉండాలి

### ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండాలి

### రాష్ట్రం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్,జూన్ 11(ప్రజాజ్యోతి):- వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మహోత్సవం,ఇంకుడు గుంతలు తదితర అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం.జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూనియోజకవర్గంలోని ఏడు మండలాలకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించి మొక్కల నాటకం, సంరక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో కలిపి 2.5 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు.మండల కేంద్రాల నుంచి గ్రామాలకు నూతనంగా నిర్మించిన రహదారుల ఇరువైపులా విస్తృతంగా అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా హుస్నాబాద్-రామవరం, హుస్నాబాద్-ఎల్కతుర్తి, హుస్నాబాద్- ఆరేపల్లి, కొండాపూర్, నవాబ్పేట, ఇందుర్తి, సముద్రాల, కోహెడ, తంగళ్లపల్లి, ముల్కనూరు తదితర గ్రామాల మధ్య నిర్మించిన రహదారుల వెంట మొక్కలు నాటాలని సూచించారు.హుస్నాబాద్-ఎల్కతుర్తి జాతీయ రహదారి ఇరువైపులా కూడా పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.గత ఏడాది సిద్ధిపేట జిల్లాలో ఆశా వర్కర్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు ఒకే రోజు మొక్కలు నాటిన విధానాన్ని ఈసారి కూడా అమలు చేయాలని, కింది స్థాయి ఉద్యోగి నుంచి జిల్లా కలెక్టర్ వరకు అందరూ భాగస్వాములు అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈసారి ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి లక్ష మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు మంత్రి తెలిపారు. ప్రతి గ్రామంలో మొక్కల నాటకం, సంరక్షణ కోసం ఐదుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కమిటీలను వన సంరక్షక్‌లుగా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అటవీ భూములు, ప్రభుత్వ స్థలాలు, రహదారుల పక్కన విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించిన మంత్రి, ఈత, తాటి మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. గౌడ సంఘాలు, ఎక్సైజ్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఈత, తాటి మొక్కల లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు.కరీంనగర్ జిల్లా పరిధిలో లక్ష్యంగా పెట్టుకున్న 8 లక్షల మొక్కల నాటకంలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. అలాగే హనుమకొండ జిల్లా పరిధిలోని భీమదేవరపల్లి మండలంలో 1.20 లక్షల మొక్కలు, 6,500 ఈత తాటి మొక్కలు, ఎల్కతుర్తి మండలంలో 83 వేల మొక్కలు, 2,500 ఈత తాటి మొక్కలు నాటాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం కాగానే తాను స్వయంగా మొక్కల నాటే కార్యక్రమంలో పాల్గొంటానని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి పాఠశాల విద్యార్థి, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు మొక్కల నాటకంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లలో ప్రతి ఇంటికి ఐదు మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కరివేపాకు, మునగ, జామ తదితర పండ్ల చెట్లను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద, అటవీ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఇంకుడు గుంతలు, మొక్కల పెంపకంలో ఉత్తమ పనితీరు కనబరిచిన గ్రామాలను ప్రత్యేకంగా గుర్తించి అభినందిస్తామని చెప్పారు.

### అర్బన్ పారెస్టు పార్కులో సౌకర్యాలు.....

హుస్నాబాద్లో నిర్మితమవుతున్న అర్బన్ ఫారెస్ట్ పార్కో చిన్నారుల కోసం ఆట స్థలాలు, ఓపెన్ జిమ్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అర్బన్ ఫారెస్ట్ పార్క్కు అనుసంధానంగా ఉన్న మహాసముద్రం గండి, రాయికల్ వాటర్ ఫాల్స్, సర్వాయి పాపన్న కోట, భైరవస్వామి ఆలయం వంటి పర్యాటక ప్రాంతాలను అధికారులు సందర్శించి పర్యాటక అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హరితహారం లక్ష్యాలను మించి సాధించి, హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో మూడు జిల్లాలో డిఎఫ్ఓ లు , పిడి డీఆర్డీఓ లు , ఎస్సీ పంచాయతీ రాజ్ లు అధికారులు పాల్గొన్నారు.





## చల్లగా చూడమ్మా నాయకమ్మ

చిన్నకోడూరు,జూన్11, (ప్రజాజ్యోతి): మండల కేంద్రమైన చిన్నకోడూరు లోని నాయకమ్మ ఆలయంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకా లు, కుంకుమార్చనలు, మంగళహారతులు నిర్వహించి మొక్కులు చెల్లించు కున్నారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు, సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు,పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

## వ్యక్తికి కఠిన కారాగార శిక్ష

చిన్నకోడూరు, జూన్11, (ప్రజాజ్యోతి): వివాహితపై అత్యాచార యత్నానికి పాల్పడిన కేసులో నిందితుడికి సిద్దిపేట కోర్టు కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.మండల పరిధి అనంతసాగర్ గ్రామానికి చెందిన బాధితురాలి ఇంట్లోకి గత 2020 అక్టోబర్ 9న అదే గ్రామానికి చెందిన మెడుధుల బాలరాజు అక్రమంగా ప్రవేశించి ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు పరార య్యాడు. అనంతరం బాధితురాలు చిన్నకోడూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ సాయికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కేసుపై పూర్తి స్థాయి విచారణ జరిపిన అనంతరం సిద్దిపేట ఒకటవ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వై. జయప్రసాద్ గురువారం తీర్పు వెల్లడించారు. నిందితుడు మెడుధుల బాలరాజుకు ఐపీసీ సెక్షన్ 354(A)(i)(ii) కింద ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా, ఐపీసీ సెక్షన్ 451 కింద ఆరు నెలల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. అదే విధంగా ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్. ఆత్మారాములు వాదనలు వినిపించగా, కేసు దర్యాప్తు చేసిన అప్పటి ఎస్ఐ సాయి కుమార్, ప్రస్తుత ఎస్ఐ చంద్రమోహన్, సీఐ సీహెచ్. విద్యాసాగర్, కోర్టు కానిస్టేబుల్ ఎస్. రవి, కోర్టు లైజనింగ్ అధికారి డి. శ్రీనివాస్ రెడ్డిలను పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అభినందించినట్లు ఎస్ఐ తెలిపారు.

# ఉపాధి హామీ కూలీల బతుకు భరోసా



### జాతీయ ఉపాధి హామీ పథకం..

### గ్రామీణ పేదల జీవితాల్లో వెలుగులు

కొండపాక, జూన్ 11: (ప్రజా జ్యోతి):గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్న ఈ పరిస్థితుల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ ఈజీఎస్) వేలాది పేద కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తోంది. వ్యవసాయ పనులు లేని కాలంలో కూలీలకు కనీస ఉపాధిని కల్పిస్తూ వారి కుటుంబాలకు ఆర్థిక భరోసాను అందిస్తోంది. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి సంవత్సరానికి నిర్దిష్ట రోజుల పాటు ఉపాధి కల్పించే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోంది. గ్రామాల్లో చెరువుల పూడికతీత, కాలువల మరమ్మతులు, మొక్కల పెంపకం, గ్రామీణ రహదారుల అభివృద్ధి వంటి ప్రజోపయోగ పనుల్లో కూలీలు పాల్గొంటున్నారు. దీంతో ఒకవైపు గ్రామాభివృద్ధి జరుగుతుండగా, మరోవైపు పేద కుటుంబాల జీవనోపాధి మెరుగుపడుతోంది.వ్యవసాయ పనులు లేని వేసవి కాలంలో ఉపాధి హామీ పనులే తమకు ప్రధాన ఆదాయ వనరుగా మారాయని కూలీలు చెబుతున్నారు. రోజువారీ కూలి నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరిగిందని అభిప్రాయపడుతున్నారు. కుటుంబ అవసరాలు తీర్చుకోవడం, పిల్లల చదువులు కొనసాగించడం, వైద్య ఖర్చులు భరించడం వంటి అవసరాలకు ఈ పథకం ద్వారా వచ్చే ఆదాయం ఉపయోగపడుతోందని వారు పేర్కొంటున్నారు.అయితే, కొన్నిచోట్ల హాజరు నమోదు, సాంకేతిక సమస్యలు, కూలి చెల్లింపుల్లో జాప్యం వంటి ఇబ్బందులు



ఎదురవుతున్నాయని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ సమస్యలను వెంటనే పరిష్కరించి, పనులు నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్రామీణ పేదల జీవితాల్లో ఆశాకిరణంగా నిలిచిన జాతీయ ఉపాధి హామీ పథకం, కేవలం ఉపాధి కల్పించే కార్యక్రమం మాత్రమే కాకుండా 'పేద కుటుంబాల బతుకు భరోసా'గా మారింది. ప్రభుత్వం ఈ పథకానికి మరింత నిధులు కేటాయించి, పనిదినాలను పెంచితే గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు మరింత మేలు చేకూరే అవకాశం ఉంది.

# ఉన్నత లక్ష్యాలతో విద్యార్థులు ముందుకు సాగాలి

### సురభి దయాకర్ రావు ఫార్మసీ

### కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

### గజ్వేల్ జూన్ 11(ప్రజా జ్యోతి): పీజీ ఈసెట్ లో రాష్ట్ర స్థాయి

### ర్యాంకుల తో ప్రతిభ చాటిన సురభి ఫార్మసీ కళాశాల విద్యార్థులు

ఉన్నత లక్ష్యాలతో విద్యార్థులు ముందుకు వెళ్ళినప్పుడే వారు అనుకున్న స్థాయికి చేరుకోవడం సులభమవుతుందని సురభి దయాకర్ రావు ఫార్మసీ కళాశాల డాక్టర్ మాచర్ల వెంకటరమణ విద్యార్థులకు సూచించారు.ఎమ్మెల్సీ, కళాశాల సెక్రటరీ సురభి వాణీదేవి ఆదేశాల మేరకు ఇటీవల విడుదలైన పీజీ ఈసెట్ ఫలితాలలో సురభి ఫార్మసీ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించిన సందర్భంగా వారికి గజ్వేల్ మండలం రిమ్మనగూడ సమీపంలో గల సురభి దయాకర్ రావు ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్





డాక్టర్ వెంకటరమణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్, కళాశాల సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పీజీ ఈసెట్ లో కళాశాల విద్యార్థులు బి. నికిత 112, శిరిన్ బేగం 173, స్రవంతి 842, ఫయాజ్ 898 రాంకు తో పాటు మరో 20 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారని కొనియాడారు.కళాశాల సెక్రటరీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి గ్రామీణ ప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం నాణ్యత ప్రమాణాలతో కూడిన ఫార్మసీ కళాశాల స్థాపించి ఎంతో మంది నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా అన్ని వసతులు కల్పించి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని, కళాశాలలో ఉన్న అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సహకారంతో ఈ రోజు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నామని, ఫార్మసీ రంగం రోజు రోజుకు విస్తృతంగా అభివృద్ధి చెందుతుందని, ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. విద్యార్థులు సోషల్ మీడియా, గేమింగ్, లకు బానిసలు కాకుండా చదువుపై శ్రద్ధ వహించి భవిష్యత్తు లో ఉన్నత స్థాయికి ఎదగాలన్న సంకల్పంతో కృషి చేయాలని కోరారు.ఎంతో కష్టపడి తమ పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది డాక్టర్ స్వాతీ, సౌమ్య, నరేశ్ రెడ్డి, సౌందర్య, పూజిత, శ్రీముఖి, లుబ్న, భారతీ, అర్చన, చంద్రిక, ప్రవీణ్, కరుణాకర్, పురుషోత్తం, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంప్లెక్స్ ఎరువులను అధిక ధరలకు అమ్మితే
# కఠిన చర్యలు తప్పు

**యూరియాను యాప్ ద్వారానే విక్రయించాలి**

**సన్న రకం వరి విత్తనాలు అందుబాటులో ఉంచాలి**

**డిఏఓ స్వరూపారాణి**

దౌల్తాబాద్, జూన్ 11: ( ప్రజా జ్యోతి) కాంప్లెక్స్ ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా డి ఏ ఓ స్వరూప రాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనకి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపుల యజమాన్యులు రైతులకు సరిపడే సన్నరకం వరి విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసక్తి గల డీలర్లకు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ నుండి సరిపడే సన్న రకం విత్తనాలు సరఫరా చేస్తామని తెలిపారు. రైతులకు





సన్న రకం దాన్యం పండిస్తే రైతులకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే రైతులందరికీ యూరియాను యాప్ ద్వారా మాత్రమే అందించాలని, కాంప్లెక్స్ ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఫర్టిలైజర్ షాపుల యజమానులు ప్రతిరోజు ఎప్పటికప్పుడు స్టాక్ బోర్డు పై నిల్వ ఉన్న విత్తనాలు, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ ను ప్రతిరోజు స్టాక్ బోర్డులో రైతులకు కనబడే విధంగా అందుబాటులో పెట్టాలని షాపు యజమానులను హెచ్చరించారు. వర్షాకాలం సీజన్లో రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకొని షాప్ లైసెన్స్ ను రద్దు చేసి షాప్ సీజ్ చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సాయికిరణ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.








## అటవీ కళాశాలలో పర్యావరణ దినోత్సవం

**పాము కాట్ల నివారణ చర్యలు**

**ప్రథమ చికిత్స విధానాలపై అవగాహన**

**అపోహలనివృత్తి వాటి సంరక్షణ**

**పాల్గొన్న ఎఫ్ సి ఆర్ ఐ డిప్యూటీ డైరెక్టర్ కవిత**



ములుగు,జూన్ 11 (ప్రజా జ్యోతి) పాము కాటు వేస్తే నివారణ చర్యలు చికిత్స విధానాలపై అటవీ కళాశాల మరియు పరిశోధన సంస్థలో అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 సందర్భంగా సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో గల అటవీ కళాశాల మరియు పరిశోధన సంస్థలో ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ సహకారంతో సరి సృపాల అవగాహన పాము కాటు నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎఫ్ సి ఆర్ ఐ డిప్యూటీ డైరెక్టర్ కవిత (ఏసిఎఫ్) పాల్గొనగా,సరిసృపాల పర్యావరణ ప్రాధాన్యం విషపూరిత విషరహిత పాముల గుర్తింపు పాముకాట్ల నివారణ చర్యలు ప్రథమ చికిత్స విధానాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమంలో బిఎస్సి (ఆనర్స్) విద్యార్థులు,అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది,హౌస్కీపింగ్,మరియు గార్డెనింగ్ సిబ్బంది పాల్గొనగా పాములపై ఉన్న అపోహలను నివృత్తి చేస్తూ వాటిని సంరక్షణ అవసరాన్ని వివరించారు.ఈ సందర్భంగా ఎఫ్ సి ఆర్ ఐ తుది సంవత్సరం విద్యార్థి శ్రీ కార్తీక్ కళాశాల ఆవరణలో కనిపించే వివిధ పాముల జాతులు,వాటి నివాసాలు,పర్యావరణంలో వాటి పాత్ర మరియు క్షేత్ర స్థాయి కార్యకలాపాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రత్యేక ప్రదర్శన నిర్వహిం చారు. ముఖ్యంగా పాము కాటుక గురైనప్పుడు ప్రశాంతంగా,కదలకుండా ఉంచడం ఎక్కడైతే పాము కరిచిందో అక్కడి అవయవాన్ని కదలకుండా ఉంచి వైద్యం పొందడం ఎంత ముఖ్యమో వివరించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో,సిబ్బందిలో వన్యప్రాణి సంరక్షణ పర్యావరణ అవగాహన కలిగిందన్నారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంలో సహకరించిన ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు పై ఇంత నిర్లక్ష్యమా

సిద్దిపేట అర్బన్, జూన్ 11 (ప్రజాజ్యోతి): చేతికొచ్చిన ధాన్యం కొనుగోలు కేంద్రా కు తెచ్చి మళ్ళీ పంట వేసే సమయం వచ్చినా ఇంత వరకు ప్రభుత్వం ధాన్యం తరలించడంలో ఇంత నిర్లక్ష్యమా అంటూ రైతులు రోడ్డు పైకి వచ్చారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో ధాన్యం తరలించడం లేదని రైతులు రోడ్డుపైకి వచ్చి ధర్నా చేశారు. రోడ్డుపై ముల్ల కంచెలు వాహనాలు అడ్డుగా పెట్టి సుమారు గంటన్నర పాటు నిరసన తెలిపారు. సిద్దిపేట నుండి హుస్నాబాద్, హుస్నాబాద్ నుండి సిద్దిపేటకు వచ్చే వాహనాలు ఆగిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు వచ్చి రైతులను ఎంత సముదాయించినా కూడా వినకుండా కలెక్టర్, ఎమ్మార్వో రావాలని రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చి ధాన్యాన్ని తరలించేలా చూడాలని రైతులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సుమారు రెండు నెలల పాటు కొనుగోలు కేంద్రాలలో దాన్యం ఉండడం తాము ఎప్పుడూ చూడలేదని రైతుల పట్ల ప్రభుత్వం అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదని అన్నారు. ఆరు నెలలు కష్టపడి పంట పండిస్తే అమ్ముకోవడానికి ఎదురు చూడాల్సి వస్తుందన్నారు. స్థానిక అధికారులు స్పందించి లారీలు వచ్చేలా చూసి ధాన్యాన్ని తరలించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని ధాన్యాన్ని రోడ్లపైకి



తీసుకొచ్చి ఇక్కడే పోస్తామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మార్వో అక్కడికి చేరుకొని లారీలు వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చింతల శ్రీనివాస్ యాదవ్, ఆయా పార్టీల నాయకులు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దేశ రక్షణకు దౌల్తాబాద్ విద్యార్థులు

### జూనియర్ కళాశాల నుండి అగ్నిపథ్ కు ముగ్గురు



దౌల్తబాద్, జూన్ 11(ప్రజా జ్యోతి): దేశ రక్షణకు తనవంతు సేవను అందించేందుకు అగ్నిపథ్ ద్వారా ముగ్గురు దౌల్తాబాద్ విద్యార్థులు ఎంపికైనట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు దొమ్మాట గ్రామానికి చెందిన బాసమైన





అఖిల్, పొగాకు ప్రసాద్, బైరగారి అరవింద్ లు కేంద్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టినటువంటి అగ్ని పథ్ లో సైనికులుగా ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్టూడెంట్ కౌన్సిలర్ బి. శివ కుమార్ మార్గదర్శకత్వంలో, ఎప్పటికప్పుడు విద్యార్థిని విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తూ ప్రభుత్వ ఉద్యోగుల అవకాశాలు తెలపడం జరిగిందన్నారు. కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు, పూర్వ విద్యార్థులకు వారధిగా ఉంటూ, విద్యార్థులను ప్రోత్సహిస్తూ, సరియైన మార్గదర్శిగా ఉంటూ వారి భవితవ్యాన్ని సరైన దిశను సూచిస్తున్నారన్నారు. అగ్నిపథ్ నియామకం పట్ల అధ్యాపక బృందం లక్ష్మీనారాయణ, సుధాకర్, దయానంద్, మంగ్తా నాయక్, సంపత్ కుమార్, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, భాగ్యమ్మ నాగేశ్వరరావు , పవన్ కుమార్ పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## టెట్ అభ్యర్థులకు ప్రయాణ పరీక్ష

నంగునూరు, జూన్ 11(ప్రజా జ్యోతి): తెలంగాణ టెట్–2026 అభ్యర్థులకు ప్రయాణ పరీక్షగా మారింది. టెట్ –2026 తొలి విడత ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు జరగుతుంది. ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రాల కేటాయింపు అభ్యర్థులకు ఆందోళనకరంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా పేపర్–1, పేపర్–2లకు కలిపి మొత్తం 1.37 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వీరి కోసం 16 జిల్లాల్లో 61 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు రోజుకు రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే పరీక్షా కేంద్రాల కేటాయింపుపై పెద్ద ఎత్తున అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ నివాస ప్రాంతాలకు సమీపంలో పరీక్షా కేంద్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ... 150 నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేంద్రాలను కేటాయించారని ఆరోపిస్తున్నారు. దీంతో పరీక్షకు హాజరయ్యేందుకు అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూర ప్రాంతాలకు ప్రయాణించాల్సి రావడం వల్ల అదనపు ఖర్చులు, సమయాభావం, వసతి సమస్యలు తలెత్తుతున్నాయని అభ్యర్థులు వాపోతున్నారు. ముఖ్యంగా మహిళా అభ్యర్థులు, చంటి పిల్లల తల్లులు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే నిరుద్యోగులు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. పరీక్ష ఉదయం పూట జరిగే కేంద్రాలకు హాజరు కావాలంటే ముందు రోజే బయలుదేరి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. కొన్ని జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు ఉన్నప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా దూర ప్రాంత కేంద్రాలను కేటాయించడం పట్ల అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాల కేటాయింపులో పారదర్శకత పాటించాలని, సాధ్యమైనంత వరకు సమీప జిల్లాల్లోనే కేంద్రాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాల కోసం టెట్ నిర్వహించడం స్వాగతించ తగిన విషయమే అయినప్పటికీ, కేంద్రాల కేటాయింపులో అభ్యర్థుల సౌకర్యాన్ని పరిగణనలోకి తీసుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సమీప జిల్లాల్లో ఖాళీ కేంద్రాలు ఉన్నప్పటికీ సుదూర ప్రాంతాలకు కేటాయించడం వెనుక కారణాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు. సాంకేతిక కారణాలు, కేంద్రాల పరిమిత సంఖ్య వల్ల ఇలా జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నప్పటికీ, సాధ్యమైనంత వరకు సమీప కేంద్రాల్లోనే పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పరీక్షల నిర్వహణలో సౌకర్యవంతమైన ఏర్పాట్లు ఉంటేనే తాము ప్రశాంతంగా పరీక్షలు రాయగలుగుతామని అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ అంశాన్ని పునః సమీక్షించి అభ్యర్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కేంద్రాల మార్పునకు అవకాశం కల్పించాలని నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# గ్రామ అభివృద్ధికి గ్రామ ప్రజల ఐక్యత ముఖ్యం




### బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరి రెడ్డి

### గ్రామ సర్పంచ్ పోసాన్ పల్లి రాజు

గజ్వేల్ జూన్ 11(ప్రజా జ్యోతి): సిద్దిపేట జిల్లాలోని జగదేవపూర్ మండ లం తిమ్మాపూర్ గ్రామంలో ఆదర్శ గ్రామ నిర్మాణం పై గ్రామ సభ సమా వేశం ఏర్పాటు చేసారు.బాల వికాస గత 40 సంవత్సరాలుగా తెలంగా ణలోనే కాక 8 పొరుగు రాష్టా ల్లోను పలు గ్రామాభివృద్ధి పథకాలను ప్రారంబించి వాటిని కొనసాగిస్తూ లక్షలాది మం దికి లబ్దిని చేకూరుస్తుంది. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఒక్కరితో సాధ్యం కాదని, గ్రామ పౌరులందరూ ఒకే ఆశయం కొరకు పనిచేస్తే గ్రామంలో మార్పు సాధ్యం అవుతుందని సూచించారు .గ్రామాల్లో స్థిరమైన మార్పు కొరకు నాయకు లంత కలిసి పనిచేయాలని ప్రజలను కలుపుకొని గ్రామాభి వృద్ధిని సాధిం చాలని, ఒక్కరుగా చేయలేనిది అందరు కలిస్తే సాధ్యం అవుతుంది. గ్రామం ఆదర్శ గ్రామంగా మారాలంటే నాయకులంత ఐకమత్యంతో పార్టీలకు, కుల మత వర్గాలకు అతీతంగా కలిసి పనిచేయాలి.గ్రామం మనది బాధ్యత మనదే అనే ఉద్దేశంతో ప్రజలలో అవగాహన పెంచుతూ చైతన్యం పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆదర్శ గ్రామ నిర్మాణ పథకం మేనేజర్ మంజుల తెలియజేసారు. గ్రామ



సర్పంచ్ పోసాన్ పల్లి రాజు మాట్లాడుతూ సంస్థ మా గ్రామాన్ని దత్తతు తీసుకున్నందుకు మాకు సంతోషంగా ఉందని, మా గ్రామంలోని ప్రతి వీదిలో నుండి ప్రజ లు ఈ పథకం లో సంస్థ మా గ్రామాన్ని దత్తత బాగస్వాములు అయ్యే విదంగా చూసుకుంటామని తెలియజేసారు.గ్రామ పంచాయతి నుండి పూర్తి సహకారం అందిస్తామని, గ్రామ సభకు ప్రతి కుటుంబం కనీసం ఒక్కరైనా హాజరు కావడానికి ప్రయత్నం చేస్తామని.మా గ్రామంలో సంస్థ ద్వారా నిర్వహించే ప్రతి కార్యక్రమం లో ప్రజలను బాగాస్వాములను చేస్తామన్నారు.ప్రలందరినీ కలుపుకొని మార్పు దిశగా అడుగులు వేస్తామని తెలియజేసారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు, గ్రామంలోని ముఖ్యమైన నాయకులు 15 మంది తో పాటు పంచాయతి సెక్రెటరీ,అంగన్వాడీ, ఐకెపి విఓఏ,ఆశా కార్యకర్తలు సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## చందాపూర్ ప్రథమ సర్పంచ్ నరిశెట్టి లింగం అనారోగ్యంతో మృతి

తొగుట, జూన్ 11(ప్రజాజ్యోతి): తొగుట మండలం చందాపూర్ గ్రామ ప్రథమ సర్పంచ్ నర్శెట్టి లింగం గురువారం ఉదయం మరణించారు. గ్రామ మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింలు మాట్లాడుతూ నర్సెట్టి లింగం చందాపూర్ గ్రామ సర్పంచ్ గా ఉన్న సమయంలో జన్మభూమి కార్యక్రమంలో భాగంగా చందాపూర్ లో అనేక కార్యక్రమాలు నిర్వహించి అందరికి ఆదర్శంగా నిలిచాడన్నారు. చందాపూర్ లోని వాటర్ ట్యాంక్ నూతనంగా నిర్మించిన పాఠశాల భవనం, ప్రహరీ గోడ, వీధులలో మట్టి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను నిర్మించారని, ఆయన చిన్నతనం నుండే చాలా కష్టపడే తత్వమని తుక్కాపూర్, బ్రాహ్మన బంజేరుపల్లి, ఎల్లారెడ్డిపేట గ్రామాలలో బీడీల కంపెనీలు పెట్టి కూడా అనేక మంది బీడీ కార్మికులకు ఉపాధి కల్పించారని పేర్కొన్నారు. లింగం మరణవార్త తీలుసుకున్న గ్రామస్థులు ఆయన పార్టీవ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.



**మాజీ సర్పంచ్ నర్సెట్టి లింగం అకాల మరణం బాధాకరం**

చందాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ నర్సెట్టి లింగం అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని బీఆర్ఎస్ పార్టీ తొగుట మండల అధ్యక్షులు



జీడిపల్లి రాంరెడ్డి విచారం వ్యక్తం చేశారు. చందాపూర్ లో ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సెట్టి లింగం సర్పంచ్గా గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేశారని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. చందాపూర్ గ్రామ అభివృద్ధిలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన మరణం గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు . సాదాసీదా వ్యక్తిత్వం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. లింగం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. లింగం పార్టీవ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించిన వారిలో గ్రామ సర్పంచ్ చంద లావణ్య స్వామి, గ్రామ పార్టీ అధ్యక్షులు జనగామ సుభాష్ గౌడ్, నాయకులు బండారు స్వామి గౌడ్, జూపల్లి జహంగీర్, రాంబాబు తదితరులు పాల్గొని నరిశెట్టి లింగంకు నివాళులర్పించారు.

# నూటికి నూరు శాతం పిల్లలకు టీకాలు అందించాలి

**డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్**



సిద్దిపేట రూరల్ ,జూన్ 11 ,(ప్రజాజ్యోతి):జిల్లాలోని ప్రతి చిన్నారికి నూటికి నూరు శాతం టీకాలు అందేలా ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ ఆదేశించారు.గురువారం జిల్లాలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆశా డే సమీక్షా సమావేశంలో పాల్గొని ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.ప్రజలకు అన్ని రకాల ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించాలని, ప్రస్తుతం కొనసాగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.వర్షాకాలంలో వ్యాధుల నివారణకు అవసరమైన అన్ని రకాల మందులను నిల్వ ఉంచుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఉన్న ప్రతి చిన్నారిని గుర్తించి ఆరోగ్య కేంద్రాలకు తీసుకువచ్చి పూర్తి స్థాయిలో టీకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లినప్పుడు కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని అవసరమైన సలహాలు ఇవ్వాలని, చికిత్స అవసరమైతే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు.గర్భిణీల నమోదు నుంచి సుఖ ప్రసవం జరిగే వరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, తల్లి-శిశు ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ శ్రీకాంత్, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థులకు కేఆర్ గైడెన్స్ ఉచిత మార్గదర్శకత్వం



నంగునూరు, జూన్ 11(ప్రజా జ్యోతి): సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొలుపుల రాములు నిర్వహిస్తున్న కేఆర్ గైడెన్స్ ఇంజనీరింగ్ కోర్సులపై ఉచితంగా అవగాహన కల్పిస్తోంది. ఇంటర్ ఎంపీసీ విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యపై ఉచిత అవగాహన, మార్గదర్శక సేవలు అందిస్తూ ఆదరణ పొందుతోంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యలో ముందుకు సాగేందుకు అవసరమైన సమాచారాన్ని అందిస్తోంది. వేలాది మంది విద్యార్థులకు దిక్సూచిగా నిలుస్తోంది. ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కోర్సు లు, కళాశాలలపై ఆవాహన కల్పించేందుకు సిద్దిపేట జిల్లా ధూళిమిట్టకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొలుపుల రాములు కేఆర్ గైడెన్స్ ఏర్పాటు చేశారు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యా మార్గదర్శకత్వం అందించేందుకు 2020 సంవత్సరంలో దీనిని ప్రారంభిం చారు. సిద్దిపేటలో అప్పటి మంత్రి తన్నీరు హరీశ్ రావు కేఆర్ గైడెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాటి నుంచి కేఆర్ గైడెన్స్ విద్యా ర్థులకు ఇంజనీరింగ్ ప్రవేశాలు, కళాశాలల ఎంపిక, కౌన్సెలింగ్ ప్రక్రియ, కోర్సుల ఎంపిక తదితర అంశాలపై ఉచిత సలహాలు అందిస్తోంది. ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు కౌన్సెలింగ్ పై ఉచిత మార్గదర్శనం చేస్తున్నారు. ఐదేళ్ల కాలంలో అయిదు చెందిన వేల మంది విద్యార్థులు కేఆర్ గైడెన్స్ సేవలను సద్వినియోగం చేసుకున్నారు. అనేక మంది విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలు ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో బీటెక్ సీట్లు సాధించారు. తమకు అభిరుచి కలిగిన కోర్సులను కేఆర్ గైడెన్స్ ద్వారా ఉత్తమ కళాశాలల్లో పొంది ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ప్రతి ఏటా ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ కు ముందు విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాలను కొలుపుల రాములు నివృత్తి చేస్తూ సరైన నిర్ణయాలు తీసుకునేందుకు అవసరమైన సమాచారాన్ని అందిస్తున్నారు. ప్రతి సంవత్సరం విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మాజీ మంత్రి టి.హరీశ్ రావు చేతుల మీదుగా సన్మానించే కార్యక్రమాన్ని కేఆర్ గైడెన్స్ నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం తోడ్పడుతోంది.కేఆర్ గైడెన్స్ ద్వారా అందిస్తున్న విద్యా సేవలను మాజీ మంత్రి టి. హరీశ్ రావుతో పాటు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందించారు.ఇంజనీరింగ్ విద్యార్థులకు మార్గదర్శనం చేయడంతో పాటు, విద్యారంగంలో చేసిన సేవలకు కొలుపుల రాములు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. కేఆర్ గైడెన్స్ ద్వారా ఇంజనీరింగ్ కళాశాలల్లో కోర్సుల ఎంపికకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మార్గదర్శనం చేయడంతో పాటు, ఉత్తమ బోధనకు గుర్తింపుగా 2021లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. అప్పటి జిల్లా మంత్రి, ప్రస్తుత సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని స్వీకరించడం విశేషం. కేఆర్ గైడెన్స్ ద్వారా కొలుపుల రాములు ప్రస్తుతం పది వేల మంది విద్యార్థులకు విద్యా మార్గదర్శక సేవలు అందిస్తున్నారు. ఇందుకోసం పది వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేశారు. ఈ గ్రూపుల ద్వారా ఇంజనీరింగ్ విద్య, ప్రవేశాలు, కౌన్సెలింగ్కు సంబంధించిన తాజా సమాచారాన్ని నిరంతరం అందిస్తున్నారు.ఇంజనీరింగ్ విద్యపై ఉచిత మార్గదర్శనం కోసం ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు తమను సంప్రదించవచ్చునని కేఆర్ గైడెన్స్ నిర్వాహకుడు కొలుపుల రాములు తెలిపారు. ఇందు కోసం 9908134366 నెంబర్ ను వాట్సాప్ ద్వారా సంప్రదించాలని చెప్పారు. వాట్సాప్ లో సంప్రదించిన విద్యార్థులను కేఆర్ గైడెన్స్ వాట్సాప్ గ్రూపుల్లో చేర్చి అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం అందజేస్తామని వెల్లడించారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

సిద్దిపేట,జూన్ 11 ,(ప్రజాజ్యోతి):పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ శాస్త్రవేత్త టి. రవీందర్అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, సిద్దిపేటలో ఎన్విరాన్మెంటల్ అవేర్నెస్ అండ్ ప్లాస్టిక్ ఫ్రీ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ పద్ధతులపై విద్యార్థులకు సవివరంగా అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్పరిణామాలను







వివరించి, వాటి వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు.ప్లాస్టిక్ కప్పులకు బదులుగా మట్టి కప్పులు, ప్లాస్టిక్ ప్లేట్ల స్థానంలో విస్తరాకులు, నీటి నిల్వ కోసం మట్టి కుండలు, అలాగే చెక్కతో తయారు చేసిన స్పూన్లు, ప్లేట్లు వంటి పర్యావరణ హిత ఉత్పత్తులను వినియోగించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత మాట్లాడుతూ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్లో ఇప్పటికే పర్యావరణ అనుకూల విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఎక్కువగా స్టీల్ వాటర్ బాటిళ్లను వినియోగిస్తున్నారని, కళాశాల ప్రాంగణాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.